క్లుప్తంగా

అగస్త్యేశ్వరుడిని తాకిన సూర్యకిరణాలు


మూలవిరాట్‌ను తాకుతున్న సూర్యకిరణాలు

రాయచోటి జగదాంబసెంటర్ : పట్టణంలోని పాతరాయచోటిలో వెలసియున్న పురాతన శ్రీ దాక్షాయణీ సమేత శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారిని మహాశివరాత్రి పర్వదినాన సూర్యకిరణాలు తాకాయి. మకరరాశిలో ప్రవేశించిన సూర్య భగవానుడు శ్రావణ నక్షత్ర శుభ పుష్కరాంశమున బుధవారం ఉదయం సూర్య భగవానుడు స్వామి వారిపై నేరుగా సూర్యకిరణాలు పడ్డాయి. ఈ మహత్తర దృశ్యాన్ని భక్తులు చూసి ఆనందపరవశితులయ్యారు.

కన్యకా పరమేశ్వరీ ఆలయంలో అధికారులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవిని బుధవారం రాయచోటి తహసీల్దార్ నరసింహ కుమార్, మున్సిపల్ కమిషనర్ వాసుబాబులు దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆర్యవైశ్య సంఘ సభ్యులు, అర్చకులు అధికారుల పేరున ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గుండాలకోన మార్గంలో బందోబస్తు


బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఓబులవారిపల్లె : గుండాలకోన సమీపంలో ఏనుగుల దాడి వల్ల ముగ్గురు మృతి చెందడంతో మహాశివరాత్రి పండుగ రోజు గుండాలకోనలో కొలువైన నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి ప్రజలకు అనుమతి ఇవ్వలేదు. దీంతో బుధవారం వై.కోట గ్రామ సమీపంలో గుండాలకోన దారివద్ద ప్రత్యేక బలగాలతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కేవలం 20 మందికి మాత్రమే గుండాలకోన నీలకంఠేశ్వరస్వామి పూజల చేసేందుకు అనుమతులు ఇచ్చారు. రైల్వేకోడూరు రూరల్ సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అటవీశాఖ అధికారులు అనుమతులు ఇచ్చేంతవరకు ఎవరూ అడవిలోకి వెళ్లకూడదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.మహేష్ నాయుడు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్యే ఆకేపాటి


ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ముక్కంటీశ్వరుని సేవలో తరించారు. మండల పరిధిలో ఉన్న ఆకేపాటి ఎస్టేట్‌లోని ఆలయాల సముదాయంలో బుధవారం ఎమ్మెల్యే ఆకేపాటి, జ్యోతమ్మ దంపతులు ప్రత్యేకంగా పూజలు చేశారు. స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్న ప్రసాదం వితరణ చేశారు. అదే విధంగా పెద్దూరులో ఉన్న శివాలయ ప్రాంగణంలో గ్రామ ప్రజలు బుధవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. ఈ కల్యాణ వేడుకలలో పాల్గొన్న ఆకేపాటి దంపతులు స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు.

గంగ జాతరకు అన్ని ఏర్పాట్లు చేయాలి

లక్కిరెడ్డిపల్లి : శ్రీ అనంతపురం గంగమ్మ జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గంగమ్మ దేవస్థానంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 28వ తేదీ నుంచి మార్చి 2వ తేదీ వరకు అనంతపురం గ్రామంలో జరిగే గంగమ్మ జాతరలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు కల్పించాలన్నారు. నీటి సౌకర్యం, విద్యుత్ సదుపాయం, మెడికల్ క్యాంపులు, శానిటేషన్‌పై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇరు కుటుంబాల పూజారులకు న్యాయం

గంగమ్మ జాతర సందర్భంగా ఆలయంలో పూజారులుగా తమకు భాగస్వామ్యం కల్పించాలని మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఎదుట చెల్లు సురేంద్ర కుటుంబ సభ్యులు విన్నవించుకున్నారు. బుధవారం అధికారుల సమీక్ష సమావేశం కార్యక్రమానికి వచ్చిన మంత్రి రాంప్రసాద్ రెడ్డిని వారు కలిసి పూజారుల్లో తమకూ భాగస్వామ్యం చేసేలా చూడాలని చెల్లు వంశీయులు ప్రాధేయపడ్డారు. ఇందుకు ఆయన స్పందిస్తూ జాతర అయిపోగానే ఇరువురికి న్యాయం చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

కోనలో ప్రతిధ్వనించిన శివ నామస్మరణ

- భక్తులతో కిక్కిరిసిన నిత్యపూజ స్వామి కోన, అత్తిరాల
- కల్యాణ వేడుకల్లో పాల్గొన్న భక్తజనం
- పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు


సిద్దవటం: నిత్యపూజ స్వామికి కల్యాణ వేడుక జరుపుతున్న వేద పండితులు


సిద్దవటం: నిత్యపూజ స్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

సిద్దవటం : మహాశివరాత్రి పర్వదినాన లంకమల్ల అభయారణ్యంలో శివ నామస్మరణ మార్మోగింది. జిల్లాలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రం నిత్యపూజ స్వామిని దర్శించుకునేందుకు కోనకు భక్తులు తరలివచ్చారు. అలానే మండలంలోని సిద్దవటం గ్రామ సమీపంలోని కపర్దీశ్వరస్వామి కోన, సిద్దవటంలోని కామాక్షి సిద్దవటేశ్వర స్వామి, కనుమలోపల్లె సమీపంలోని నీలకంఠేశ్వరస్వామి, జ్యోతి గ్రామ శివారులోని జ్యోతి సిద్దవటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తుల తాకిడి కనిపించింది. నిత్యపూజ స్వామి కోసం వచ్చిన భక్తులు ముందుగా నీటి గుండాల్లో తడిబట్టలతో స్నానాలు చేసి స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. అధికంగా భక్తులు రావడంతో బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి భక్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. కోనకు వచ్చిన భక్తులు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. పంచలింగాల వద్ద భక్తులకు దాతలు అన్నదాన కార్యక్రమాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశారు. ఒంటిమిట్ట సీఐ, బాబు, సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల ప్రత్యేకాధికారి శివయ్య, ఉత్సవాలకు విచ్చేసిన ఎంపీడీఓ ఫణిరాజకుమారి, ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలత, ఒంటిమిట్ట సీఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్, ఆలయ చైర్మన్ జ్యోతి వెంకటసుబ్బారెడ్డి, చంద్ర, పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణం

శ్రీ నిత్యపూజ స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా బుధవారం శివ పార్వతుల ఉత్సవ మూర్తులకు కల్యాణోత్సవ వేడుక కనుల పండువగా సాగింది. దేవదాయ ధర్మాదాయ శాఖ ఉత్సవాల ప్రత్యేకాధికారి శివయ్య, ఆలయ చైర్మన్ జ్యోతి వెంకటసుబ్బారెడ్డి సమక్షంలో వేద పండితులు ప్రదీప్ శర్మ, సుబ్రమణ్యం శర్మలు శాస్త్రోక్తంగా స్వామి వారి కల్యాణ క్రతువును జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయం ఉద్యోగి చంద్ర, భక్తులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

అత్తిరాలకు పోటెత్తిన భక్తులు

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని శివాలయాలు బుధవారం భక్తులతో పోటెత్తాయి. వేకువజాము నుంచే శివాలయాల్లో అర్చనలు, ప్రత్యేక పూజలు చేయించుకునేందుకు మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున శివాలయాలకు చేరుకున్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలోని శ్రీకామాక్షి సమేత శ్రీ త్రేతేశ్వరస్వామిని దర్శనం చేసుకునేందుకు వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. వేకువజాము నుంచి రాత్రి వరకు భక్తులు తాకిడి అంతకంతకు పెరిగిపోవడంతో అత్తిరాల భక్తజనంతో కిక్కిరిసిపోయింది. భక్తులకు, మహిళా భక్తులకు స్నాన ఘట్టాలు ఏర్పాటు చేశారు. మహిళలు స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. అదే విధంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ ఉన్నత అధికారులు చర్యలు తీసుకున్నారు. వివిధ స్వచ్ఛంద సంస్థ సంఘాలు, సేవ సంస్థలు భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. అదే విధంగా భక్తులకు పెద్ద ఎత్తున మజ్జిగ ప్యాకెట్లను, మంచినీటి ప్యాకెట్లను కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఆలయ అర్చకుడు ఫణిస్వామి ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ విగ్రహాలకు ఊటుకూరులో గ్రామోత్సవం కార్యక్రమం నిర్వహించారు.

చెయ్యేటి నది తీరంపైనున్న శివాలయాలు

మండలంలో ప్రవహిస్తున్న చెయ్యేరు నది తీరం వెంట ఆదిదేవుడు శివయ్యకు పురాతన కాలంలో తొమ్మిది ఆలయాలు నిర్మించారు. వాటిలో కొలువైన శివలింగాలను ప్రత్యేకంగా అలంకరించడంతోపాటు భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లను ఆలయ నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

అత్తిరాలలో శిఖర దీపారాధన

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అత్తిరాలలో శివరాత్రి సందర్భంగా ఉదయం 9గంటలకు కపాలేశ్వర ఉత్సవాన్ని ఘనంగా చేపట్టారు. రాత్రి 7 గంటలకు శిఖర దీపారాధన కార్యక్రమాన్ని వైభవంగా చేపట్టారు. అనంతరం రాత్రి 9 గంటలకు లింగార్చన కార్యక్రమాన్ని వేదపండితులు పద్మనాభశాస్త్రి ఆధ్వర్యంలో చేపట్టారు. అదే విధంగా శిఖరదీపారాధన కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. రాత్రి 12గంటలకు లింగోద్ధరణ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 1గంటలకు నంది ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ ఈఓ జీ కొండారెడ్డి, వివిద శాఖల అధికారులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఊటుకూరులో శివపార్వతుల కల్యాణం

పదకవితా పితామహుడు అన్నమయ్య అవ్వగారి గ్రామం, మహా శివభక్తుడు భక్త కన్నప్ప జన్మస్థలమైన ఊటుకూరు గ్రామంలో వెలసిన శ్రీ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శివరాత్రి పర్వదినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రీకామాక్షీదేవి సమేత శ్రీనాగలింగేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కల్యాణ మహోత్సవంలో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, టీడీపీ పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు, ఆలయ అభివృద్ధి ప్రదాతలు ఎం.లక్ష్మీకర్‌రెడ్డి, నాగా.సుధాకర్‌రెడ్డి, బి.సుబ్బరామరాజు, జె.నాగేశ్వరరాజు, ఆర్‌సీ పెంచలరాజు, ఎం.నరసారెడ్డి, ఆర్.సుబ్బరాజు, ఎస్.నరసింహులు, ఆర్.సతీష్, వీ.బాల, ఆర్.శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



అత్తిరాలలో ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇస్తున్న శ్రీత్రేతేశ్వస్వామి, శ్రీకామాక్షిమాత


రాజంపేట రూరల్: అత్తిరాలలో దర్శనానికి పోటెత్తిన భక్తులు


రాజంపేట రూరల్: ఆదిదంపతులకు కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


రాజంపేట రూరల్: కల్యాణంలో పాల్గొన్న మహిళలు


రాజంపేట టౌన్: రుద్రాభిషేక అలంకారంలో రామలింగేశ్వరుడు


రాజంపేట టౌన్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణ వేడుక


ఒంటిమిట్ట: పుష్పాలంకరణలో శ్రీ మల్లేశ్వరస్వామి


సుండుపల్లె: పెద్దబలిజపల్లె సిద్దేశ్వర స్వామి ఆలయంలో..


నందలూరు: ప్రత్యేక పూజలందుకున్న అర్ధనారీశ్వర స్వామి


నందలూరు: కల్యాణ వేదికపై కొలువుదీరిన ఉత్సవమూర్తులు

అర్ధనారీశ్వర.. భక్త శుభంకర

హరహర మహాదేవ శంభో శంకర అంటూ శివాలయాలు, శైవక్షేత్రాలు మార్మోగాయి. మహాశివరాత్రిని పురస్కరించుకొని బుధవారం భక్తులు పెద్దఎత్తున వేకువజాము నుంచే శివాలయాలకు తరలిరావచ్చారు. దీంతో ఆలయాల వద్ద భక్తుల సందడి కనిపించింది. భక్తులు ఇక్కడి శైవక్షేత్రాలకే కాక ఇతర జిల్లాలోని దేవాలయాలకు పెద్దఎత్తున తరలివెళ్లడంతో బస్సులు కిక్కిరిసి కనిపించాయి. భక్తుల రద్దీని పురస్కరించుకుని ఆలయ కమిటీలు ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకున్నారు. అలానే పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కల్యాణోత్సవాల్లో పాల్గొన్న తీర్థప్రసాదాలను స్వీకరించారు.

– సాక్షి, నెట్‌వర్క్


లక్కిరెడ్డిపల్లె: అభిషేక పూజలు చేస్తున్న ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి


ఒంటిమిట్ట: కుడమలూరు మల్లేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన కార్యక్రమం


వీరబల్లి: భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


చిట్వేలి: సోమేశ్వరస్వామి ఆలయంలో మహా అన్నదానం


రైల్వేకోడూరు అర్బన్: రాఘవరాజుపురంలో కల్యాణోత్సవం


వీరబల్లి: హరిహరాదుల దేవస్థానంలో శివపార్వతుల కల్యాణం



పుల్లంపేట: శ్రీ పర్వతవర్ధిని శాంతిలింగేశ్వర శివాలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


వీరబల్లి : శివపార్వతుల కల్యాణం జరుపుతున్న వేదపండితులు


పెనగలూరు: నైనాదీశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం


రాయచోటి టౌన్: ఉమామహేశ్వరీ దేవి ఆలయంలో పూజలు చేస్తున్న జిల్లా ఎస్పీ సతీమణి


గాలివీడు: పుష్పాలతో అలంకరించిన దృశ్యం


ఒంటిమిట్ట: మల్లేశ్వర స్వామికి అభిషేకాలు


ఒంటిమిట్ట: కుడమలూరు జరిగిన శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


రాజంపేట రూరల్: అత్తిరాలలో భక్తుల రద్దీ


చిట్వేలి: శ్రీ భద్రకాళి ఆలయంలో ఛండీహోమం


సుండుపల్లె: మండల కేంద్రంలో జరిగిన గ్రామోత్సవంలో పాల్గొన్న భక్తులు


చిన్నమండెం: గవి మల్లీశ్వరస్వామి ఆలయంలో మంత్రి మండిపల్లి పూజలు


రైల్వేకోడూరు అర్బన్: పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు


రాజంపేట టౌన్: ఆర్టీసీ బస్సు వద్ద భక్తుల రద్దీ


సంబేపల్లె: మోటకట్ల శివాలయంలో సామూహిక పూజలు నిర్వహిస్తున్న మహిళలు


సంబేపల్లె: హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు